క్లుప్తంగా

వాకర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని మినీస్టేడియం వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కార్యవర్గ సభ్యులను అభినందించారు. నడకను ప్రోత్సహించేందుకు వాకర్స్ అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా నేరెల్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా మెరుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తోడేటి లచ్చయ్య, సహాయ కార్యదర్శిగా మహేందర్‌రావు, కోశాధికారిగా అనంతుల విఠలయ్య, డైరెక్టర్లుగా బుర్ర చంద్రశేఖర్‌గౌడ్, తొగిటి శ్రీనివాస్ ప్రమాణం చేశారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు



ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ పొందిన వారికి పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం పదవీ విరమణ పొందిన ఎస్సై మన్మథరావు, ఏఎస్సై ఖాజా నజీమోద్దీన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఎస్సై, ఏఎస్సైలను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీసు బ్యాండ్ మేళాతో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆర్ఐ సైదులు, ఆర్ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన జన్మదినం పురస్కరించుకుని పశుసంవర్ధక శాఖ లైవ్‌స్టాక్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ముందంజలో ఉంటానన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్లు పూర్ణచందర్, గరిగంటి రవి, అశోక్ పాల్గొన్నారు.


తక్కువ బరువున్న పిల్లలపై శ్రద్ధ వహించాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

రాయికల్: తక్కువ బరువున్న పిల్లలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీవో మమత సూచించారు. సోమవారం రాయికల్ పట్టణంలో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని చిన్నారులకు చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ లక్ష్మణ్, సూపర్‌వైజర్లు పద్మావతి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం సందడి



బస్‌పైకి ఎక్కిన పులి వేషధారి

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలో మొహర్రం సందడి మొదలైంది. సోమవారం జగిత్యాల పట్టణంలోని అంగడిబజార్ గుండా వస్తున్న ఆర్టీసీ బస్సు టాప్ పైకి చేరుకున్న పులి వేషదారి స్టెప్పులు వేయడంతో ప్రజలు ఆసక్తిగా చూశారు. మరో ప్రాంతంలో పులి వేషధారి బుల్లెట్ బండిపై వెళ్తుండటంతో పట్టణ ప్రజలు, యువత, చిన్నారులు ఆసక్తిగా చూస్తుండటం కనిపించింది. పులి వేషదారులతో పట్టణంలో సందడి నెలకొంది.

కథలాపూర్: మొహర్రం వేడుకల్లో భాగంగా కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో సోమవారం పెద్దపులి వేషధారులు సందడి చేశారు. డప్పుల చప్పుళ్లు, పెద్దపులి వేషధారుల నృత్యాలు ప్రజలను అలరింపజేశాయి.





వెల్లుల, పెద్దాపూర్ శివారులో దెబ్బతిన్న ఎస్సారెస్పీ కాల్వ రక్షణ గోడలు

ప్రమాదం అంచున వంతెనలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల, పెద్దాపూర్ గ్రామ శివారుల్లోని ఎస్సారెస్పీ కాల్వ వంతెనలపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నిర్వహణ, మరమ్మతుల విషయంపై అధికార యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో పలుచోట్ల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. ఎస్సారెస్పీ కాల్వ వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. దీంతో వాటి గుండా వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. ధ్వంసమైన చోట కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు. గతంలో వెల్లుల వంతెన వద్ద ప్రమాదాలు చోటుచేసుకున్నాఅధికారులు దీనిపై దృష్టి సారించలేదు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

జగిత్యాలరూరల్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఏపీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న బాలయ్య పదవీ విరమణ పొందగా ఆయనను ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో చేసిన సేవలు ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీడీ సునీత, జిల్లా ఏపీఎంల యూనియన్ అధ్యక్షుడు కోల చక్రవర్తి, సీసీల యూనియన్ అధ్యక్షుడు మెట్టు దాసు, బాలె మరియ పాల్గొన్నారు.

వెల్గటూర్ : పదవీ విరమణ అనేది ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన భాగమని జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి అన్నారు. సోమవారం వెల్గటూర్ ఎంపీడీవో వెంకటేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమానికి డీపీవో మదన్‌మోహన్, మంత్రి సతీమణి కాంతకుమారితో కలిసి హాజరయ్యారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి పాల్గొన్నారు.

ఎంఈవో జమునాదేవి సేవలు మరువలేనివి



ఎంఈవో దంపతులను సన్మానిస్తున్న డీఈవో

గొల్లపల్లి: గొల్లపల్లి మండల ఎంఈవో భూస జమునా దేవి విద్యారంగానికి అందించిన సేవలు మరువలేనివని డీఈవో రాము అన్నారు. గొల్లపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంఈవో జమునాదేవి పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎంఈవో దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బీమ సంతోష్, ఉపాధ్యాయ సంఘం నేతలు, ఎంఆర్‌సీ సిబ్బంది,ఉపాధ్యాయులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

కోరుట్లరూరల్/మేడిపల్లి/పెగడపల్లి/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/వెల్గటూర్ : కుల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ పాటు పడాలని అధికారులు అన్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కోరుట్ల మండలంలోని జోగిన్‌పల్లి, మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి, రాగోజీపేట, పెగడపల్లి మండలంలోని ముద్దులపల్లి, కథలాపూర్ మండలంలోని పెగ్గెర్ల ఇబ్రహీంపట్నం మండలం కేశాపూర్,వెల్లటూర్ మండలం పైడిపెల్లి, ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. పౌరుని హక్కులు, కుల వివక్షత, అంటరానితనం, వివిధ నేరాలకు సంబంధించి చట్టాలపై అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానం, సొంత ఖర్చులతో రోడ్డు నిర్మాణం

సారంగాపూర్: మండలంలోరి మ్యాడారం తండా గ్రామ గిరిజన రైతులు శ్రమదానం, సొంత ఖర్చులు వెచ్చించి సోమవారం కిలోమీటరు పొడవు రోడ్డు నిర్మించారు.. మ్యాడారంతండా గిరిజన గ్రామ రైతులకు తమ పంట పొలాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు నిర్మాణం లేకపోవడంతో గ్రామస్తులు రెండు రోజులుగా సమావేశాలు నిర్వహించి సొంత ఖర్చులతో రోడ్డు నిర్మించుకోవాలని తీర్మానించుకున్నారు. దీంతో రూ.3 లక్షల విలువ చేసే రోడ్డును నిర్మించడానికి వారంతా కలిసి శ్రమదానం చేయడంతో పాటు, ట్రాక్టర్లు, జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్లు తమ సొంతఖర్చులతో సమకూర్చుకుని పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో దారి ఏర్పడి రైతులకు మేలు జరుగనుంది.

ఇద్దరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు

మల్యాల: కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రశాంత్ సోమవారం మల్యాలలోని విశ్వబ్రాహ్మణ సంఘం వద్ద సంస్థకు సంబంధించిన సదస్సు నిర్వహించాడు. వడ్రంగి కులానికి చెందిన బాసోజు గోవర్ధన్, చింతల రాజేశ్వర్ అక్కడికి చేరుకుని బూతులు తిడుతూ, కులం పేరుతో దూషించారు. ఇక్కడ పనిచేయడానికి వీలు లేదని దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భూ వివాదంలో ఇరువర్గాలపై కేసు

మల్యాల : మండలంలోని ముత్యంపేటకు చెందిన కాసారం శ్రీనివాస్, గంగాధర రాజేశం మధ్య భూమి వివాదం నేపథ్యంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఇరువురి వ్యవసాయ భూమి విషయమై గొడవ జరగడంతో ఒకరినొకరు దుర్భషలాడుకుని, దాడులు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

- భార్యాభర్తల మధ్య గొడవ
- మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నం
- సీఐ చొరవతో దిగివచ్చిన వైనం



గోపాల్‌ను అదుపులోకి తీసుకున్న సీఐ

ధర్మపురి: భార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన ధర్మపురిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గాడిపెల్లి గోపాల్ టెంట్‌హౌజ్‌లో పనిచేస్తున్నాడు. కొదిరోజులుగా భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన గోపాల్ పోలీస్‌స్టేషన్ ముందున్న సెల్‌టవర్ ఎక్కాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, దీనికి తమ భార్యాభర్తల మధ్య తగాదాలేనని పేర్కొన్నారు. సుమారు రెండు గంటల పాటు దిగిరాకపోవడంతో అక్కడ ఉత్కంఠ నెలకొంది. విషయం తెలుసుకున్న సీఐ రాంనర్సింహారెడ్డి పోలీస్, ఫైరింజన్, సిబ్బందిని రప్పించారు. అప్పటికే సంఘటనా స్థలానికి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఒకదశలో దూకుతానని గోపాల్ బెదిరించగా.. అతడి కూతురు పింకీ మైకులో 'డాడీ నువ్వులేకుంటే మేం బతకలేం.. కిందికి దిగి రా..' అంటూ కన్నీటి పర్యంతమైంది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. కూతురు అపస్మారక స్థితి చేరడంతో గోపాల్ టవర్ దిగి వచ్చాడు. తన కూతురు కోసమే దిగి వచ్చానని, ఎవరి కోసమో కాదంటూ కూతురును దగ్గరకు తీసుకొని గుండెలవిసేలా రోదించాడు. గోపాల్‌కు భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

సమాచారం

ఉచిత శిక్షణ

జగిత్యాల: వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ నైపుణ్యాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, రెస్యూమ్ తయారీ, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూలు, ఆత్మవిశ్వాసం, మానసిక ఆరోగ్య శిక్షణ అందించేందుకు హైదరాబాద్‌లో నాలుగు రోజుల పాటు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. అభ్యర్థులు వచ్చేనెల 12 వరకు ఆన్‌లైన్‌లో TGOBMSS. CGG. GOV. INలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో జాబితా ప్రదర్శన

జగిత్యాల: జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ కింద వైద్యాధికారుల పోస్టులకు భర్తీ కోసం ఇటీవల దరఖాస్తులు స్వీకరించి, ప్రాథమిక జాబితాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్ WWW. JAGTIAL. TELANGANA. GOV. IN లో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్ తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను పరిశీలించుకుని ఈ జాబితాపై అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తగిన ధ్రువీకరణ పత్రాలు జతచేస్తూ ఈనెల 1 నుంచి 5వ తేదీలోపు సమర్పించాలన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో కుంకుమార్చనలు



కుంకుమార్చనలో మహిళలు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలోని శ్రీ భూదేవి, నీలాదేవి సమేత శ్రీ జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి, అమ్మవార్లకు మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతకాల ఆరాధన, బాలభోగ నివేదన, నిత్యహోమం, శ్రీ మహాలక్ష్మీ ఇష్టి హోమ కార్యక్రమాలను ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా మంగళవారం స్వామివారి రథోత్సవం జరగనుంది.

ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీవోగా రామకృష్ణ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీవోగా కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం జెడ్పీసీఈవో గౌతమ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను ఎంపీవో రామకృష్ణరాజు, సిబ్బంది అభినందించారు.

ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయండి

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని ధర్మశాల (శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం) స్థలంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి కలెక్టర్ సత్యప్రసాద్‌కు సోమవారం లేఖ రాశారు. స్టాక్ పాయింట్‌కు అనువైన స్థలం లేని తరుణంలో ధర్మశాల స్థలంలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

జగిత్యాల: ఉర్దూమీడియం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు అన్నారు. సోమవారం ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న మహ్మద్ జుల్ఫికర్ అలీ పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రిజర్వేషన్ అభ్యర్థులు లేక ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌సుందర్, బేగ్, ఆత్మచరణ్‌రావు పాల్గొన్నారు.

జగిత్యాల విద్యార్థి ప్రతిభ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస ఎక్స్‌లెన్స్ స్కూల్ విద్యార్థి గౌతమ్‌కుమార్ ఇటీవల నిర్వహించిన సెమ్స్ ఒలంపియాడ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. సోమవారం హైదరాబాద్‌లోని విజ్ఞాన కేంద్రంలో ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వాహకుల చేతుల మీదుగా పురస్కారం, అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా మానస ఎక్స్‌లెన్స్ ప్రిన్సిపాల్ రజిత, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నోట్ బుక్‌లు పంపిణీ

కోరుట్ల రూరల్/మల్లాపూర్: కోరుట్ల మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 25 మంది పేద విద్యార్థులకు, మల్లాపూర్ మండలం చిట్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నోట్ బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేష్ గౌడ్, ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర



పెద్దమ్మ బోనాలతో భక్తుల ఊరేగింపు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో పెద్దమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ భక్తులు బోనాలతో ఊరేగింపు చేసి దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుల సంఘాల వారీగా పెద్దమ్మకు మేకలను బలిదానం చేశారు. ఈ ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవతను పూజించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. సాయంత్రం వేళ ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద ప్రజల సందడి నెలకొంది.



సాక్షి స్పందన

పిచ్చి మొక్కలు తొలగించారు..

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని హరిజన వాడలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు చుట్టుకుని ప్రమాదకరంగా మారడంతో ఆదివారం సాక్షిలో ట్రాన్స్‌కో జర దేఖో అనే కథనానికి విద్యుత్ అధికారులు స్పందించి సోమవారం పిచ్చి మొక్కలను తొలగించారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పాఠశాలల్లో సదుపాయాలపై నిర్లక్ష్యం చేయొద్దు

వెల్గటూర్ : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించే సదుపాయాల పట్ల నిర్లక్ష్యం చేయరాదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంతకుమారి అన్నారు. సోమవారం వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గురుకుల పాఠశాలను, కుమ్మరిపల్లి మోడల్ స్కూల్‌ను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులు క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరగా మంత్రితో మాట్లాడి మైదానం ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మంజుల నాయకులు మురళి, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, పూదరి రమేష్, ప్రిన్సిపాల్ హరిత తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా ముందుకు పోదాం



పార్టీలో చేరుతున్న నాయకులు

కోరుట్ల: స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలియజేయాలని కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం రాత్రి కోరుట్లలో మాజీ కౌన్సిలర్ సోగ్రాబీ, కాంగ్రెస్ నాయకులు ఏఆర్.అక్బర్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది యువకులు జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, నాయకులు గంగాధర్, ప్రభాకర్, మధు, నాగభూషణం, నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మల్లాపూర్: అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలత నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, సిరిపురం రవీందర్, ఏఎంసీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కోరుట్ల రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ శివారులోని అయోధ్య పట్నం, మెమిన్‌పుర ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

జగిత్యాలటౌన్: జూలై 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమెను విజయవంతం చేయాల్సిందిగా మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు నూతన లేబర్ కోడ్లను ఉపసంహరించుకుని సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ సెక్రటరీగా శ్రీనివాస్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మార్కెట్ కమిటీ కార్యదర్శిగా శ్రీనివాస్ నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

రాయికల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీవో సుష్మ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపేటలోని రాజరాజేశ్వరస్వామి నాగాలయంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవో విక్రమ్, అర్చకులు రాజేశ్వర శర్మ, సెక్రటరీ రాజేశ్, మాజీ ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, నాయకులు ఏనుగు నాగిరెడ్డి, రమేశ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల ముందస్తు అరెస్టు

మల్లాపూర్: గత ప్రభుత్వం చేసిన సర్దుబాటుతో పాటు తక్కువ సర్వీస్‌తో ఏలాంటి బెనిఫిట్స్ లేకుండానే రిటైర్మెంట్ కాబోతున్న పూర్వ వీఆర్ఏలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సదరు వీఆర్ఏలు డిమాండ్ చేశారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వారు తహసీల్దార్ వీర్‌సింగ్‌కి వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లోని సీసీఎల్ మీటింగ్‌ను అడ్డుకునేందుకు వెళ్తున్న మండల వీఆర్ఏలను సోమవారం వేకువజామునే ఎస్సై రాజు నేతృత్వంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సోషల్ మీడియా ప్రచారాలతో మోసపోవద్దు

వెల్గటూర్ : సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి రైతులు మోసపోవద్దని మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ అన్నారు. వారి కంపెనీ ప్రమోషన్ కోసం ఇచ్చే తప్పుడు ప్రకటనలు నమ్మి లైసెన్స్‌డ్ దుకాణంలో కాకుండా బయట విత్తనాలు కొనుగోలు చేసి పంట కాలం ముగిసాక దిగుబడి రాక ఇబ్బందులు పడుతున్నారని, విత్తనాల ఎంపిక విషయంలో జాగ్రత్తగా ఉండాలని రైతులకు సూచించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, లైసెన్స్‌డ్ షాపులోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

ఉర్దూ మీడియం పాఠశాల అభివృద్ధికి కృషి

కోరుట్ల: పట్టణంలోని గంగంపేట ఉర్దూ మీడియం పాఠశాలను బాగు చేయిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం ఆయన గంగంపేటలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరమల గంగాధర్, రమేష్, మహాదేవ స్థానం ఆలయ కమిటీ అధ్యక్షుడు పిట్టల నరేష్, వెంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సయ్య, మేకల నర్సయ్య, వెంకటి ఉన్నారు.

అల్ఫోర్స్‌లో మెహందీ వేడుకలు

జగిత్యాల: అల్ఫోర్స్ పాఠశాలలో మెహందీ ఉత్సవ్ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. . కార్యక్రమంలో ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.